క్లుప్తంగా

ఇంటి నిర్మాణానికి సామగ్రి అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాల గ్రామానికి చెందిన నిరుద్యోగి పద్మమ్మకు ఇంటి నిర్మాణం కోసం ఇంటి సామగ్రిని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చారు. ఈ మేరకు గ్రామంలో సర్పంచ్ నరేందర్‌రెడ్డి, భారత జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గణేష్, నరేందర్ తదితరులు ఇంటి సామగ్రిని అందజేశారు.

ముమ్మరంగా వరినాట్లు



కోడేరు: మండలకేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మూడు రోజులుగా వర్షాలు కురియడంతో చెరువులు, కుంటల్లో నీరు చేరడంతో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. రైతులు పంటలు సాగు చేసే ముందు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి శ్రీరాం తెలిపారు.

అర్హులందరికీ దళితబంధు ఇవ్వాలి

కొల్లాపూర్: అర్హులందరికీ దళితబంధు పథకాన్ని మంజూరు చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు పోతుగంటి బాలకృష్ణుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండో విడత దళితబంధు పథకం అమలును వెంటనే ప్రారంభించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. పరిమిత సంఖ్యలో కాకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ దళితబంధు యూనిట్లను మంజూరు చేయాలన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

లింగాల: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి సాధ్యమని ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అంబట్‌పల్లి శివారులో వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటకు కత్తెర పురుగు ఆశించిందని దీని నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను మందులను ఎలా పిచికారి చేయాలో వివరించారు.

శుద్ధీకరణ ప్లాంట్ స్థల పరిశీలన

కల్వకుర్తిటౌన్: పట్టణంలో మురుగు శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణం కోసం మున్సిపల్ చైర్మన్ సత్యం, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌లు శుక్రవారం మున్సిపల్‌లోని సీబీఎం కళాశాల వెనకవైపు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షాహెద్, ఏఈ శివకృష్ణ, నాయకులు కిషోర్‌రెడ్డి, తాహేర్‌అలీ, నూరి, కాంట్రాక్టర్ సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పట్టణంలో 24.2 మి.మీ వర్షపాతం

కొల్లాపూర్: పట్టణంలో గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 24.2 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ముసురు వర్షం కురిసింది. వర్షాల వల్ల రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో జనజీవనం స్తంభించింది.

డ్రైవింగ్ లైసెన్సుకు దరఖాస్తు చేసుకోండి

నాగర్‌కర్నూల్: నియోజకవర్గ యువతీ, యువకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ నెల 24న నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. వివరాల కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

అండగా ఉంటా



మన్ననూర్: బాధితులకు అండగా ఉంటానని జెడ్పీటీసీ, సీబీఎం ట్రస్టు చైర్ పర్సన్ డాక్టర్ అనురాధ అన్నారు. అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యం, ప్రమాదాల బారిన పడిన బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆమె పరామర్శించి వైద్య సేవలు చేశారు. మన్ననూర్ గ్రామ పంచాయతీ మాజీ కారోబార్ దస్తగిర్, తుర్కపల్లి గ్రామంలోని పంబలి కర్ణల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వెంకటేశ్వర్లబావి గ్రామం గేటు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాగం పర్వతాలు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పంబలి బుచ్చయ్య, వైస్ ఎంపీపీ ప్రణిత, సంబు శోభ, సుజాత, హరినారాయణ, దివాకర్, అంబనారాయణ, విజయ్, బాలు ఉన్నారు.

హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ



ఉప్పునుంతలలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకటయ్య



పెద్దకొత్తపల్లి ఆదిరాలలో..

ఉప్పునుంతల: హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అచ్చంపేట డీఎల్‌పీఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హరితహారం, లేబర్ బడ్జెట్ అచీవ్‌మెంట్, ఇంకుడు గుంతలు, ఏడు రిజిస్టర్ల నిర్వాహణ, స్వచ్ఛ సర్వేక్షణ్ తదితర అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీల వారిగా నిర్దేశించిన విధంగా మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు, ఎంపీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

చారకొండ: గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా గ్రామాల్లో హరితహారం మొక్కలు నాటాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. మండలంలోని జూపల్లిలో వన నర్సరీ, సాముహిక మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో పనులను శుక్రవారం ఎంపీడీఓ జయసుధ పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, రహదార్లలో హరితహారం మొక్కల కోసం గుంతలు తీసి నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ లక్ష్మయ్య, ఈసీ రవి, టీఏ యాదయ్య, ఎఫ్ఏ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఆదిరాలలో హరితహారంలో భాగంగా శుక్రవారం చెరువుకట్టపై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నాటిన మొక్కలను సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేషీలు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా మొక్కలను ఎంపీడీఓ గంగమోహన్ నాటించారు. ఈసర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో గుర్తించిన స్థలాలలో నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు.

పారదర్శకంగా ఓటరు నమోదు



కల్వకుర్తిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంరెడ్డి

లింగాల: పారదర్శకంగా ఓటరు నమోదు చేయాలని అచ్చంపేట ఆర్డీఓ గోపిరామ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, ఎన్నికల విధుల నిర్వహణపై బీఎల్‌ఓలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బీఎల్‌ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. 18 సంవత్సరాలుపై బడిన యువతీ, యువకులకు కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. త్వరలో జరుగబోవు అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో బీఎల్‌ఓల విధులు బాధ్యతలపై అవగాహన కల్పించారు. లో తహసీల్దార్ మునిరోద్దీన్, డీటీలు రాములునాయక్, ముబినాబేగం, సీతారాంనాయక్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కల్వకుర్తి: క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓలు నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని తహసీల్దార్ రాంరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ పరిధిలోని బూత్‌లెవల్ ఆఫీసర్స్ సూపర్‌వైజర్లకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని పోలింగ్‌బూత్‌ల పరిధిలో ఓటర్ల నమోదు, ఓటర్ లిస్టును తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశిత్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు, బూత్‌లెవల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ స్వీపర్ల జీవితాలు దుర్భరం



నాగర్‌కర్నూల్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్ల జీవితాలు దుర్భరంగా మారాయని స్కూల్ స్వీపర్ల సంఘం, సీఐటీయూ నాయకులు ఆర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 160 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు రూ.1623లు గౌరవ వేతనం ఏమాత్ర సరిపోవడం లేదన్నారు. ధరలను దృష్టిలో ఉంచుకొని స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.27వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం నాయకులు రామేశ్వరమ్మ, అర్జున్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

లింగాల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ లింగమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతాంజలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు సమాకాలంలో హాజరుకావాలని కోరారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి

లింగాల: బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పూజారి బుడ్డయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2వ వార్డుకు చెందిన కొంత మంది ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఎవరు లేరని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులను వ్యాఖ్యలను ఆయన ఖండించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, నిరంజన్, తరుణ్, వెంకటయ్యగౌడు, అశోక్, పాండు, సలేశ్వరం, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బూత్ కమిటీలు



తెలకపల్లి: బీఆర్ఎస్ బలోపేతానికి బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ హన్మంతురావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ రెడ్డపాకుల రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కమరెడ్డిపల్లిలో రమేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బంగారయ్య, సిద్దార్థరెడ్డి, భరత్, విష్ణువర్ధన్ రావు, రమేష్, రాజు, యశ్వంత్, సుల్తాన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులు హర్షం

కందనూలు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాకులను కొనసాగించాలంటూ రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జిల్లా అతిథి అధ్యాపకుల సంఘం నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కార్యాలయం ఎదుట స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర నాయకుడు సదానందం గౌడ్, యూనియన్ నాయకులు అలీ, రవీందర్‌రెడ్డి, సతీష్‌కుమార్, భీమేశ్వర్, బాలరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

కందనూలు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలోని దేశిటిక్యాల ప్రాథమిక పాఠశాల స్లాబ్ పైపెచ్చులూడుతున్నాయి. పాఠశాల గదులను గ్రామ యువకులు పరిశీలించారు. పాఠశాలకు సెలవులు ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమయానికి విద్యార్థులు లేకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.



సైబర్‌నేరాలపై అవగాహన



చారకొండ: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం.రవి అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో ఎమ్మార్పీ కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఆధార్, బ్యాంకు సంబంధిత ఓటీపీలను చెప్పొద్దన్నారు. అనుమానిత వ్యక్తులు కన్పిస్తే డయల్ 100 ఫోన్ చేసి తెలపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేష్ నాయక్, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, పోలీస్ సిబ్బంది, నాగయ్య, శ్రీశైలం గౌడ్, మోతిలాల్, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలకపల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ప్రదీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మండలంలోని మహాత్మాజ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.బాలబాలికలు రాజ్యాంగం కల్పించే హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పరశురాములు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

24న ఇంటర్వ్యూలు

కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన మైనారిటీ సంక్షేమ శాఖ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మనోహరా చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం ఆమె ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దరఖాస్తు చేసకున్న మైనారిటీ అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి యోగా తరగతులు

అచ్చంపేట: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 22 నుంచి సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ధ్యాన యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సంబు భాస్కర్, రాఘవేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రంజిత్ గురూజీ ద్యాన యోగాతో పాటు బీపీ, షుగర్, అధిక బరువులపై ప్రత్యేక సాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

భూమి పూజ

పెంట్లవెల్లి: మండలంలోని మాధవస్వామినగర్‌లో సర్పంచ్ లక్ష్మీదేవమ్మ రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్, ఏఈ సాయిరాం, వెంకటేశ్వర్లు, గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా ఖర్గే జన్మదిన వేడుకలు



కందనూలు: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నాగం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమన్నారు.అర్థం రవి, నిజాం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అమ్రాబాద్: పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కొయ్యల ఈశ్వరయ్య, ఎలిమినుటి వీరయ్య, పర్వతాలు, బుచ్చయ్య తదితరులు శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆయన ఆహ్వానించారు.

సర్టిఫికెట్ల పంపిణీ



పెద్దకొత్తపల్లి: ఏకల్ గ్రామోత్తమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకల్ ఆన్ వీల్ పేరుతో బస్సులో 15 ల్యాప్‌టాప్‌లను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని గ్రామాలలో గ్రామీణ విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చారు. మొత్తం 19 బ్యాచ్‌లు ఏర్పాటు చేసి 300 మంది విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చారు. శుక్రవారం శిక్షణ ముగియడంతో విద్యార్థులకు ఎస్ఐ రాజుయాదవ్ ఏర్పాటు చేసిన సమావేశంలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



అచ్చంపేట రూరల్: ముస్లింలకు రూ.లక్ష రుణం అందజేస్తామని మంత్రి హరీశ్‌రావు చేసిన ప్రకటనపై ముస్లింలు నిరసన తెలిపారు. ముస్లింల అభివృద్ధి కోసం కాదని ఎన్నికల జిమ్మిక్కేనని ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌అలీ, రఫి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముస్లీం మైనార్టీ నాయకులు మహబూబ్‌అలీ, రఫి, గౌస్‌పాష, ఇసాక్, ఖాదర్, సాధిక్ పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి



పెంట్లవెల్లి గ్రంథాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

కొల్లాపూర్: అల్లర్లకు, హింసకు కేంద్రంగా మారిన మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని కేఎల్ఐ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన గిరిజన సంఘం నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆదివాసీ, గిరిజనులు హత్యలకు, అత్యాచారాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు గోపాల్‌నాయక్, శంకర్‌నాయక్, తిరుపతి, నరసింహ్మ, తదితరులున్నారు.

పెంట్లవెల్లి: మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు మహిళల నగ్నంగా ఊరేగింపుపై ఐద్వా, సీఐటీయూ, కేవీపీఎస్ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఈ సందర్భంగా దోషులను వెంటనే గుర్తించి శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈశ్వర్, పలు సంఘాలు మహిళలుపాల్గొన్నారు.

తాడూరు: దేశంలో బీజేపీ పరిపాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుర్మయ్య, బాలయ్య, మద్దిలేటీ, ఉస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల అభివృద్ధికి కృషి



ప్రభుత్వ విప్ బాలరాజును సన్మానిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: కుల సంఘాలు, సమాజ సేవకు పాటు పడుతున్న వివిధ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని లైఫ్ ఇన్సూరెన్సు ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, గంగిరెడ్డుల కుల సంఘం భవన నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, కౌన్సిలర్ శివ, ఎల్ఐసీ అచ్చంపేట శాటిలైట్ బ్రాంచ్ మేనేజర్ వెంకన్న, డీఓలు వీరేశం, ప్రదీప్, లియాఫీ అధ్యక్షుడు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

లింగాల: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం సాధిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన 50 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ విప్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. సర్పంచ్ కోనేటి తిర్పతయ్య, మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య, కేటీ తిర్పతయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్వకుర్తిరూరల్: భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యుడు రమేష్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు సంఘం ఆధ్వర్యంలో రూ.10 వేలు, మేస్త్రీ వెంకటయ్య రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ఉప్పునుంతల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువుల బస్తాలను అందుబాటులో ఉంచామని పీఏసీఎస్ సీఈఓ రవీందర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఏపీ 900ల బస్తాలు (బస్తా రూ. 1350లు), 20.20.0.13 కాంప్లెక్స్ ఎరువు 1400ల బస్తాలు (బస్తా రూ. 1200లు), 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు 200ల బస్తాలు (బస్తా రూ.1500లు), పొటాష్ 500ల బస్తాలు (బస్తా రూ.1700లు), సూపర్‌ఫాస్ఫేట్ 200ల బస్తాలు (బస్తా రూ. 500లు) అందుబాటులో ఉన్నాయని సీఈఓ తెలిపారు.

పాతపింఛన్‌తోనే న్యాయం



కల్వకుర్తిరూరల్: కొత్త పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని జాయింట్ ఫోరం ఫర్ రిస్టొరేషన్ ఆఫ్ ఓల్డ్ పింఛనర్ స్కీం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు చిన్నయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సమావేశానికి ప్రతి ఉద్యోగి తరలిరావాలని చిన్నయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రామేశ్వరయ్య, పాండయ్య, లింగమయ్య, నెహ్రూప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని బైరాపూర్ గ్రామానికి పల్లె దవాఖాన మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ దార్ల కుమార్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు కల్వకుర్తిలో వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఉన్న పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరుకుందని వివరించారు. పల్లె దవాఖాన ఏర్పాటు చేస్తే ఎనిమిది గ్రామాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని వివరించారు. బైరాపూర్ వాగుపై నిర్మించే బ్రిడ్జి పనులను ప్రారంభించాలని కోరారు. అనంతరం లైసెన్స్‌లను ఇవ్వాలని గౌడ కులస్తులు విన్నవించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్, గౌడకులస్తులు తదితరులు ఉన్నారు.

'రాష్ట్రంలో నియంత పాలన'

ఊర్కొండ: రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడుదామని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పరశురాములు అన్నారు. బీజేపీ చేపట్టిన చలో బాటసింగారం కార్యక్రమానికి పిలుపునిచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి అరెస్టును ఖండిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని రహదారిపై నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, ఆంజనేయులు, బీజేవైఎం నాయకులు శివశంకర్ అరవింద్ గౌడ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు బ్రహ్మాచారి, నాయకులు శ్రీను, రాఘవేందర్, లక్ష్మణ్, శ్రీకాంత్ యాదవ్, నరేందర్‌గౌడ్, భాస్కర్, అర్జున్ రెడ్డి, రాజారాం, శంకర్, శివ తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



పెద్దకొత్తపల్లి: దేవినేనిపల్లి, ముష్టిపల్లి, పెద్దకొత్తపల్లి గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారి రమేష్ పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తిపంటకు పచ్చదోమ ఆశించడంతో నివారణకు ఇమిడర్‌క్లోరిఫైడ్ మందును పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కాండం తొలుచుపురుగు ఉన్నట్లు గమనించి, దీని నివారణకు హిమామాక్సిన్ బెంజోడ్ మందులను పిచికారీ చెయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ముజీద్, జానకిరాం, రాధ, రైతులు గోపాల్‌గౌడ్, మహేష్, మల్లయ్యలు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవాలి

తాడూరు: రసాయనిక ఎరువులను అధికంగా ఉపయోగించొద్దని ఏఓ సాయి రమేశ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పొలుమూరులో రైతు జాఫర్ పొలాన్ని పరిశీలించారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గుతుందన్నారు. జీలుగ విత్తనాలతో రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ చంద్రప్రకాశ్ ఉన్నారు.

రైతువేదిక పరిశీలన

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రకల్ రైతు వేదికను జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. క్లస్టర్‌కు సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను, వ్యవసాయ విస్తీర్ణాన్ని అడిగి తెలుసుకున్నారు. పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ రమేశ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

బిజినేపల్లి: వాతావరణ మార్పుల కారణంగా వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది రాజేశ్వర్, గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెం వసతి గృహాల్లో, పాఠశాల్లో విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, జాండీస్, అతిసార తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో గజవర్ధనమ్మ, యాదయ్య, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దండ: మండలంలోని నారాయణపూర్‌లో హన్మాన్ దేవాలయ నిర్మాణానికి ఆమనగల్లుకు చెందిన బికుమాండ్ల వెంకట్ రూ.35వేల విరాళం ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామంలో సర్పంచ్ అంజినాయక్‌కు దాత నగదును అందజేశారు. ఆలయాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తార్‌సింగ్, లచ్చిరాంనాయక్, రవి తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

పెద్దకొత్తపల్లి: జొన్నలబొగుడ తండాలో సారా తయారీదారుల ఇళ్లలో సోదా చేసేందుకు వెళ్లిన కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులను తండాకు చెందిన లక్ష్మన్‌నాయక్, ఉమేష్, బాలు, అఖిల్ అడ్డుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజుయాదవ్ తెలిపారు.